క్లుప్తంగా

నేడు గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటన

చారకొండ: మండలంలోని జూపల్లి, జేపల్లి, శేరిఅప్పారెడ్డిపల్లి, చంద్రాయన్‌పల్లి గ్రామాల్లో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి పర్యటించి గ్రామాల్లో పలు అభివృద్ధిలో భాగంగా నిర్మించిన వైకుంఠధామాలు, రైతు వేదికలు ప్రారంభించి, గ్రామపంచాయతీ నూతన భవనాలకు శంకుస్థాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయా గ్రామాల సర్పంచ్‌లు మల్లీశ్వరి, రవీందర్ రెడ్డి, రంగారెడ్డి, వసంత శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

సీఎంని కలిసిన చారకొండ వెంకటేష్



చారకొండ: సీఎం రేవంత్ రెడ్డి దావోస్ పర్యటనను ముగించుకొని రాష్ట్రానికి విచ్చేసిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చారకొండ వెంకటేష్ శనివారం సీఎం నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు.

29న మండల సర్వసభ్య సమావేశం

వెల్దండ: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ విజయ అధ్యక్షతన ఈ నెల 29న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరవుతున్నట్లు చెప్పారు. అన్ని మండల శాఖ అధికారులు పూర్తి నివేదికలతో హాజరుకావాలన్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్యదర్శులు సకాలంలో సమావేశానికి చేరుకోవాలన్నారు.

ఎంపీ అభ్యర్థిగా కొడిదల రామును ప్రకటించాలి

చారకొండ: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా నాగర్‌కర్నూల్ జిల్లా యువజన అధ్యక్షుడు కొడిదల రామును కాంగ్రెస్ అధిష్ఠానం గుర్తించి, అభ్యర్థిగా ప్రకటించాలని చారకొండ మండల కాంగ్రెస్ యువజన సంఘం అధ్యక్షుడు గణేష్ గౌడ్ కోరారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో యువజన కాంగ్రెస్ నాయకులు విలేకరులతో మాట్లాడారు. కొడిదల రాము తెలంగాణ ఉద్యమంలో తమ వంతు పాత్రను చురుకుగా పోషించారని గుర్తుచేశారు. గత ప్రభుత్వ హయాంలో విద్యార్థి సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీశారన్నారు. అలాంటి నాయకుడిని కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటిస్తే భారీ మెజార్టీతో గెలుస్తారని అన్నారు. అనిల్ గౌడ్, మహేష్ గౌడ్, గోరటి శివ, లింగం గౌడ్, శివ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్‌కు కేటాయించాలి

పెద్దకొత్తపల్లి: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ టికెట్‌ను కాంగ్రెస్ పార్టీ వారు ఎమ్మార్పీఎస్ నాయకుడు జెట్టి ధర్మరాజుకు కేటాయించాలని మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకులు శనివారం కోరారు. ఎమ్మార్పీఎస్ నాయకులు వెంకటయ్య మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీల కోసం పోరాటం చేస్తున్న ఆయనకు టికెట్టు కేటాయించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

మైక్‌సెట్ వితరణ

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలకు పూర్వ విద్యార్థులు మైక్‌సెట్ వితరణ చేశారు. శనివారం కళాశాలలో పనిచేస్తున్న అర్థశాస్త్రం అధ్యాపకులు శ్రీనివాస్, 10వ తరగతి విద్యార్థులు, హుజూర్ నగర్‌కు చెందిన ఓసెన్‌ఐస్ సొసైటీ వారు కలిసి కళాశాల ప్రిన్సిపాల్ డా.శ్రీపాద శర్మానికి అందజేశారు. మైక్‌సెట్ వితరణ చేసిన వారిని ప్రిన్సిపాల్‌తో పాటుగా కళాశాల లెక్చలర్లు శాలువాతో సన్మానించారు.

సమస్యల పరిష్కారానికి గ్రామసభ

కోడేరు: సమస్యల పరిష్కారం కోసమ గ్రామసభ నిర్వహించిన్నట్లు సర్పంచ్ వెంకటస్వామి తెలియజేశారు. శనివారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ వద్ద గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సీసీరోడ్లు, డ్రెయినేజీ తదితర వాటికి తీర్మానాలు చేసిన్నట్లు చెప్పారు. గ్రామ ప్రజలు గ్రామాభివృద్ధికి సహకరించాలని ఎంపీడీఓ బాలచంద్రసృజన అన్నారు.

నేడు ఐఐటీ, నీట్ ఎంట్రెన్స్ టెస్టు

అచ్చంపేట రూరల్: పట్టణంలోని న్యూ ఎక్సీడ్ హైస్కూల్‌లో ఈ నెల 28న ఆదివారం ఐఐటీ, నీట్ ఎంట్రెన్స్ టెస్టును నిర్వహించనున్నామని ఆ స్కూల్ కరస్పాండెంట్ కపిలవాయి చంద్రమోహన్, ప్రిన్సిపాల్ శ్వేత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 6, 7, 8 తరగతులకు గానూ ఎంట్రెన్స్ టెస్టు నిర్వహించి ప్రతిభ కల్గిన విద్యార్థులను చేర్చుకుంటామన్నారు. పరిమిత సీట్లు మాత్రమే ఉన్నాయని తెలిపారు. పెద్ద నగరాలు, పట్టణ కేంద్రాల్లో కార్పొరేట్ స్థాయి స్కూళ్లలోనే ఐఐటీ, నీట్ క్లాసెస్ ఉంటాయని, నల్లమల మారుమూల ప్రాంతంలోనూ విద్యార్థులకు ఉన్నతమైన విద్యనందించే క్రమంలో పాఠశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో క్లాసులు నిర్వహిస్తామని చెప్పారు.

చట్టాలపై అవగాహన అవసరం



కోడేరులో చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జిల్లా సీనియర్ సివిల్ జడ్జి సబిత

కోడేరు: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సీనియర్ సివిల్ జడ్జి సబిత అన్నారు. శనివారం మండల కేంద్రంలో బాలికల గురుకుల పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఆడ పిల్లలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. క్రమశిక్షణతో చదివి తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చి తమ గ్రామాలకు గుర్తింపు తీసుకురావాలన్నారు. అనంతరం పాఠశాల పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు గదుల కొరత, తరగతి గదిలోనే పాఠాలు చెప్పడం, అక్కడే భోజనాలు చేయడం, అల్మారాలు లేవన్నారు. కనీసం బాత్‌రూంలకు తలుపులు లేవని, డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ప్రిన్సిపాల్ రష్మికి సూచించారు. కొల్లాపూర్ ప్రధాన సివిల్ జడ్జి నితిన్‌తేజ, అదనపు సివిల్ జడ్జి జ్యోత్స్న గుంటి, మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి..

తెలకపల్లి: మాదక ద్రవ్యాలతో మానవాళికి, యువతకు ఎంతో నష్టం వాటిల్లుతుందని, వాటికి యువత దూరంగా ఉండాలని ఎస్‌ఐ రామేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సీఎల్ఆర్ విద్యాసంస్థల్లో విద్యార్థులకు మాదక ద్రవ్యాల నిషేధంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడారు. యువత చెడు అలవాట్లకు వ్యసనాలకు లోనుకాకూడదని, ప్రభుత్వం నిషేధించిన మత్తు పానియాలు, గంజాయి వంటి మాదక ద్రవ్యాల బారిన పడకుండా జాగ్రత్త వహించాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, ప్రణాళికా బద్ధంగా ఏకాగ్రతతో లక్ష్యాలను చేరుకోవాలని, సత్ప్రవర్తనతో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ రాజమహేందర్ రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రకాశ్‌రెడ్డి, సందీప్‌కుమార్‌రెడ్డి, అధ్యాపకులు బాబయ్య పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాలపై దృష్టి సారించాలి..

తెలకపల్లి: విద్యార్థులు క్రమ శిక్షణ, పట్టుదలతో లక్ష్యాన్ని చేరుకునేందుకు దృష్టి సారించాలి, షీటీం హెడ్‌కానిస్టేబుల్ వెంకటయ్య అన్నారు. శనివారం మండల పరిధిలోని పెద్దపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో షీటీం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. షీటీం పనితీరును విద్యార్థులకు వివరించారు. షీటీంను ఎలా సంప్రదించాలో అవగాహన కల్పించారు. వాట్సాప్ నంబర్ 87126 57676, అత్యవసర సేవలు చేరుకోవడానికి 100 నంబర్‌లకు డయల్ చేయాలన్నారు. ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రాంలో ఎవరైనా ఇబ్బంది పెట్టినట్లయితే నేరుగా షీటీంకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సోషల్ మీడియాలో ఎలాంటి ఫొటోలు, వీడియోలను పోస్టు చేయవద్దని సూచించారు. బాల్యవివాహాలు జరగకుండా చూడాలని, బాల్య వివాహాలతో అనేక ఇబ్బందులు ఏర్పడుతాయన్నారు. అదే విధంగా గుడ్‌టచ్, బ్యాడ్ టచ్ గురించి చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, ఫోక్సో చట్టాలు, శిక్షలు, సైబర్ సెక్యూరిటీ వంటి వాటిపై అవగాహన కల్పించారు. సమావేశంలో షీటీం సభ్యులు వెంకట్ నాయక్‌తో పాటు ఉపాధ్యాయులు బచ్చన్న పాల్గొన్నారు.

ఉపాధి పనులు చేపట్టాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ గంగమోహన్

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఉపాధి పనులు చేపట్టి అధిక సంఖ్యలో కూలీలు పాల్గొనేలా చూడాలని ఎంపీడీఓ గంగమోహన్ కోరారు. శనివారం మండల కేంద్రంతో పాటు ఇంద్రకల్, యాదిరెడ్డిపల్లి గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పనులను పరిశీలించడంతో పాటు నర్సరీల నిర్వహణ వాటిని ఏ విధంగా మొక్కలను సంరక్షించాలో వంటి వివిధ అంశాలకు సంబంధించి నిర్వాహకులకు అవగాహన కల్పించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో క్షేత్రసహాయకులు, ఎంపీటీసీలకు ఎంపీపీ శ్రీదేవి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ముందస్తు ప్రణాళిక ఏర్పాటు చేసుకుని పనులు గుర్తించాలన్నారు. అనంతరం ఎంపీపీ శ్రీదేవి మాట్లాడారు. గ్రామాల్లో పెండింగ్‌లోని పనులన్నింటిని తక్షణమే పూర్తి చేయించాలని, త్వరలో సమావేశ మందిర నిర్మాణ పనులు కూడా పూర్తి కానున్నాయని పేర్కొన్నారు.

ఖాదర్‌పాష దర్గా ఉర్సు ఏర్పాట్ల పరిశీలన



దర్గా వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న కమిషనర్, నాయకులు

కొల్లాపూర్: పట్టణంలోని ఖాదర్‌పాష దర్గా ఉర్సు ఉత్సవాలు ఆదివారం గంధోత్సవంతో ప్రారంభం కానున్నాయి. సోమవారం ఉర్సు ఉత్సవాలు నిర్వహించనున్నారు. దర్గా వద్ద ఉత్సవాల ఏర్పాట్లను శనివారం మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ మహిమూదాబేగం, కౌన్సిలర్లు సిబ్బంది నర్సింహారావు, రహీంపాష, నయూమ్, డాక్టర్ రాముడుయాదవ్‌లు పరిశీలించారు. కమిషనర్ రాజయ్యను దర్గా వద్దకు పిలిపించి, భక్తులకు అవసరమైన ఏర్పాట్లను మున్సిపాలిటీ ద్వారా పర్యవేక్షించాలని సూచించారు. నాయకులు వేణుగోపాల్‌యాదవ్, ఖాదర్ పాష, తాహెర్, మల్లయ్య, కృష్ణమనాయుడు, దిలీప్‌శెట్టి తదితరులున్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



నర్సింగరావుకు వినతి అందజేస్తున్న వీఓఏల సంఘం నాయకులు

నాగర్‌కర్నూల్ రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా వీఓఏలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరింపజేయాలని వీఓఏల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం డీఆర్‌డీఓ నర్సింగరావుకు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడారు. కొత్తగా వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం వీఓఏల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, గుర్తింపుకార్డులు ఇవ్వాలన్నారు. ఫిబ్రవరి 16న దేశ వ్యాప్తంగా కొనసాగుతున్న సార్వత్రిక సమ్మెలో వీఓఏలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఆ సంఘం నాయకులు సుమలత, సుమతి, అంజయ్య, దేవయ్య, మల్లేష్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో విద్యార్థి ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయ బృందం

లింగాల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కె.శివ(9వ తరగతి) ఈ నెల 22న జిల్లా స్థాయిలో నిర్వహించిన జంతు సంక్షేమ పక్షోత్సవాల సందర్భంగా 'కాలుష్య నివారణ చర్యలు, ప్రకృతికి, జంతువులకు ఎలా సహకరిస్తాయి' అనే అంశంపై నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబర్చాడు. జిల్లా స్థాయిలో టాప్ టెన్‌లో నిలిచాడు. ఈ సందర్భంగా శనివారం పాఠశాల ఆవరణలో హెచ్‌ఎం శేఖర్‌తో పాటు ఉపాధ్యాయ బృందం అభినందించారు.

'బంజారా సమాజానికి గర్వకారణం'

అచ్చంపేట రూరల్: బంజారా జాతికి చెందిన కేతావత్ సొంలాల్ నాయక్‌కు పద్మశ్రీ అవార్డు వరించడం యావత్ బంజారా సమాజానికి గర్వకారణమని టీయూడబ్ల్యూజే హెచ్–143 రాష్ట్ర కమిటీ సభ్యుడు లావుడ్య చందునాయక్ అన్నారు. శనివారం హైదరాబాద్‌లో పద్మశ్రీ అవార్డుకు ఎంపికైన కేతావత్ సొంలాల్‌నాయక్ దంపతులను కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆకుతోటబావి తండాకు చెందిన కేతావత్ సొంలాల్ నాయక్ భగవద్గీతలోని 701 శ్లోకాలను తెలుగులిపిలో బంజారా భాషలో అనువదించినందుకు గాను కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డుకి ఎంపిక చేసిందన్నారు. సొంలాల్ నాయక్ రచించిన భగవద్గీత అనువాదాన్ని టీటీడీ 2014లో ప్రచురించిందని, భగవద్గీత శ్లోకాలు బంజారాలకు సులభంగా అర్థం కావాలనే ఉద్దేశంతో భగవద్గీత శ్లోకాలను బంజారా భాషలోకి అనువదించారని తెలియజేశారు.

వడ్డె వృత్తిదారుల క్యాలెండర్ ఆవిష్కరణ

నాగర్‌కర్నూల్ రూరల్: వడ్డెర వృత్తిదారుల 2024 నూతన క్యాలెండర్‌ను శనివారం కలెక్టర్ ఉదయ్‌కుమార్ చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. కార్యక్రమంలో వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఇరుగది కుర్మయ్య, జిల్లా నాయకులు పసుపుల శ్రీను, మల్లేష్, వెంకటస్వామి, బంగారయ్య, వెంకటస్వామి, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడిగా సంతోష్



అచ్చంపేట రూరల్: నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడిగా అమ్రాబాద్ మండలానికి చెందిన రామావత్ సంతోష్‌ను నియమించారు. ఈ మేరకు ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడారు. జిల్లాలోని విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్షుడిగా నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్, మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు డాక్టర్ వంశీకృష్ణ, రాజేష్‌రెడ్డి, నారాయణరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

'ఐక్యతతో ఉండాలి'

కందనూలు: జిల్లా కేంద్రంలోని సెంటినరీ ఎంబీ చర్చ్ ఆధ్వర్యంలో 150 మంది క్రైస్తవులు శనివారం వరంగల్ జిల్లాలోని కరుణాపురం చర్చ్‌ని సందర్శించారు. ఈ సందర్భంగా చర్చ్ చైర్మన్ జోసెఫ్ మాట్లాడారు. వరంగల్ జిల్లాలోని కరుణాపురంలో నిర్మించిన క్రీస్తు జ్యోతి ప్రార్థన మందిరం ప్రపంచంలోనే రెండో అతిపెద్ద చర్చ్‌గా ప్రసిద్ధిగాంచిందని అన్నారు. సుమారు రూ.100 కోట్లతో చర్చ్ నిర్మాణం జరిగిందన్నారు. నాగర్‌కర్నూల్ సెంటినరీ ఎంబీ చర్చ్ ఆధ్వర్యంలో క్రీస్తుజ్యోతి ప్రార్థన మందిరంలోని ప్రత్యేక (ఆరాధనకు) ప్రార్థనకు హాజరుకావడం గొప్ప ఆశీర్వాదం అని అన్నారు. నాగర్‌కర్నూల్ ఎంబీ చర్చిలో ఉన్న సమస్యలు అన్ని తొలగిపోయి, సంఘంలో అందరూ ఐక్యతతో ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు చేసినట్లు చెప్పారు. సంఘం పెద్దలు బీఎస్ ఏలియా, పి.సంపత్ కుమార్, హనీ, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

ముమ్మరంగా సామాజిన తనిఖీ



వెల్దండ: మండల పరిధిలోని బండోనిపల్లి, లింగారెడ్డిపల్లి తదితర గ్రామాల్లో శనివారం జాతీయ ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ ముమ్మరంగా సాగుతుంది. ఈ సందర్భంగా గ్రామాల్లో చేపట్టిన పనులపై రికార్డులను పరిశీలిస్తున్నారు. గ్రామ సభలను నిర్వహించి ఉపాధిహామీ పథకంలో చేపట్టిన వివిధ పనులను వివరించారు. అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టరీత్య చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. సర్పంచ్‌లు అంజయ్య, చంద్రమ్మ, తనిఖీ బృందం సభ్యులు తదితరులు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

నాగర్‌కర్నూల్ రూరల్: రానున్న పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి, చట్టబద్ధత కల్పించాలని ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు సందె కార్తీక్ ఇన్‌చార్జ్ బుక్కపురం మహేష్ డిమాండ్ చేశారు. శనివారం ఈ మేరకు నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మందకృష్ణ నాయకత్వంలో ఎస్సీ వర్గీకరణ సాధన కోసం మాదిగ విద్యార్థులంతా ఏకంకావాలని, ఉద్యమంలో నిర్మాణాత్మకంగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడు కొయ్యల భరత్, రమేష్, చింతకుంట కుమార్, స్వామి పాల్గొన్నారు.

ఐసీఐసీఐ ఫౌండేషన్ ఉదారత

మన్ననూర్: అమ్రాబాద్ మండలంలోని వివిధ గ్రామాల్లో ఐసీఐసీఐ ఫౌండేషన్ సహాయ కార్యక్రమాలు చేపడుతూ.. తమ ఉదారతను చాటుకుంటుందని ఫౌండేషన్ అభివృద్ధి అధికారి కొట్టం లింగస్వామి అన్నారు. ఈ సందర్భంగా శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. మూగజీవాల దాహార్తిని తీర్చడం కోసం వివిధ గ్రామాలతో పాటూ మన్ననూర్‌లో శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారి, ఐటీడీఏ ఎదుట నీటి తొట్లను ఏర్పాటు చేయించామని చెప్పారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు

ఉప్పునుంతల: మండల కేంద్రానికి చెందిన కోనేరు స్వాతి ఫిర్యాదు మేరకు శనివారం అదనపు కట్నం వేధింపులపై ఆమె భర్త బాలనగర్ మండలం చిన్నరేవల్లికి చెందిన కోనేరు శేఖర్, అతని తల్లి చెన్నమ్మ, ఆడపడుచులు అంజమ్మ, హంసమ్మ, సుశీలతో పాటు మరదలు మల్లేష్, వెంకటేష్ మొత్తం ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ మల్లయ్య తెలిపారు. 13 ఏళ్ల కిందట ప్రేమ వివాహం చేసుకున్న సమయంలో తన తల్లిదండ్రులు కట్నంగా రూ.10 లక్షలు నగదుతో పాటు ఐదు తులాల బంగారం, గ్లామర్ బైక్ ఇవ్వడం జరిగిందన్నారు. కొన్నేళ్లుగా తనను అదనపు కట్నం కోసం తన భర్తతో పాటు అతని కుటుంబ సభ్యులు మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారని, బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలియజేశారు.

అత్తపై కోడలు దాడి

చారకొండ: మండలంలోని బొమ్మల గుడిసెల గ్రామానికి చెందిన పర్వతం వెంకటమ్మపై కోడలు యాదమ్మ దాడి చేసిన ఘటనలో అత్త వెంకటమ్మ తలకు గాయాలైన సంఘటన చోటుచేసుకుంది. స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాధితురాలు వెంకటమ్మ ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వెంకటమ్మకు ఇద్దరు కుమారులు, పెద్దకుమారుడు మృతిచెందాడు. పొలం పంపిణీ చేయాలని పెద్ద కోడలు వివాదం చేసింది. వివాదంలో అత్తపై కోడలు దాడి చేసింది. అత్త తలకు గాయాలయ్యాయి. అత్త వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన్నట్లు ఎస్‌ఐ రవి వివరించారు.

ముగ్గురికి తీవ్ర గాయాలు

వెల్దండ: మండల పరిధిలోని కొట్ర గేట్ సమీపంలో శనివారం ఉదయం ఎదురెదురుగా రెండు కార్లు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన చిలుకూరి సాయిబాబు అతని భార్య సునీత కారులో శ్రీశైలం వెళ్తున్నారు. మార్గమధ్యలో కొట్ర గేట్ సమీపంలో ఎదురుగా కేశంపేటకు చెందిన యశ్వంత్‌రెడ్డి కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ప్రమాదంలో సాయిబాబు, సునీతకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. సాయిబాబు ఫిర్యాదు మేరకు యశ్వంత్‌రెడ్డిపై కేసు నమోదు చేశామని ఏఎస్‌ఐ శ్రీనివాసులు వివరించారు.

పోస్టాఫీసులో రూ.3 లక్షల గోల్‌మాల్!

కల్వకుర్తిరూరల్: మండలంలోని రఘుపతిపేట బ్రాంచ్ పోస్టాఫీసులో రూ.3 లక్షలు గోల్‌మాల్ జరిగినట్లు గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామానికి చెందిన తిరుపతమ్మ, అంజయ్య దంపతులు ఇద్దరి పేరుమీద ఖాతాలు తెరిచి డబ్బులు జమచేస్తూ ఉండేవారు. వారితో పాటు మరికొందరు పోస్టాఫీసులో డబ్బులు జమ చేసేవారు. అయితే వారి వద్ద ఉన్న పాసుపుస్తకాల్లో వారు ఇచ్చిన డబ్బులు నమోదు చేసినప్పటికీ అందుకు సంబంధించిన డబ్బులను పోస్టల్ శాఖ ఖాతాలో డిపాజిట్ చేయలేదని సమాచారం. తిరుపతమ్మ దంపతులకు సంబంధించిన రూ.30 వేలతో పాటు మరొకరివి రూ.90 వేల లెక్కలు తేలాల్సి ఉంది. ఈ విషయంపై స్థానికులు కల్వకుర్తి బ్రాంచ్ పోస్టాఫీసులో ఫిర్యాదు చేసిన్నట్లు చెప్పారు. అయితే బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ రషీద్ అందుబాటులో లేకపోవడంతో సమగ్ర సమాచారం రావడం లేదు. రూ.3 లక్షలు అని చెప్పుతున్నప్పటికీ రూ.1.50లక్షలకు సంబంధించిన విషయం స్పష్టంగా ఉంది. మిగతా డబ్బుల విషయమై పోస్టల్ అధికారులు ఆరా తీస్తున్నారు. పోస్టల్ సిబ్బంది నెల రోజుల కిందట సమ్మెకు దిగారు. ఆ సమయంలో అన్ని బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్లు దగ్గర ఉన్న డబ్బులను బ్యాంక్‌లో జమచేసి కల్వకుర్తి పోస్టాఫీసులో నివేదిక సమర్పించిన్నట్లు తెలిసింది. అయితే రఘుపతి బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ బ్యాంక్‌లో డబ్బులు జమచేసిన విషయంగాని పోస్టాఫీసుకు ఎలాంటి నివేదిక ఇవ్వకపోవడంతో బాధితుల ఫిర్యాదు మేరకు డబ్బుల గోల్‌మాల్ విషయం బయటపడింది. రషీద్‌ను పోస్టల్ ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తామని ఓ పోస్టల్ ఉద్యోగి తెలియజేశారు.

ఫార్మాసిస్టుకు నంది, జాతీయ సేవారత్న అవార్డు



అవార్డు అందుకుంటున్న జీకే వెంకటేష్

కొల్లాపూర్: ప్రభుత్వ ఆస్పత్రిలో ఫార్మాసిస్టుగా విధులు నిర్వహిస్తున్న జీకే వెంకటేష్‌కు అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ నిర్వాహకులు నంది, జాతీయ సేవారత్న అవార్డు అందజేశారు. శనివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో అవార్డుల ప్రదానోత్సవం చేశారు. రెండు దశాబ్దాలుగా నాటక, కళారంగంలో అందిస్తున్న సేవలకు గాను సినీ ప్రముఖులు దైవజ్ఞశర్మ, హీరోయిన్ పూర్ణిమ సంయుక్తంగా వెంకటేష్‌లు ఈ అవార్డును అందించారు. అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందని, కళారంగానికి తనవంతు సేవలు అందిస్తానని వెంకటేష్ తెలిపారు. ఆయనకు అవార్డు రావడంపై స్థానిక కళాకారులు హర్షం వ్యక్తం చేశారు.

మొక్కలను రక్షించుకోవాలి



పెద్దాపూర్‌లో మొక్కలు పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

వెల్దండ: హరితహారంలో నాటిన ప్రతి మొక్కను రక్షించుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని పెద్దాపూర్‌లో పల్లెప్రకృతి వనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రోడ్లకు ఇరువైపుల నాటిన మొక్కలకు కంచెలను ఏర్పాటు చేయాలన్నారు. ఎండ తీవ్రతకు మొక్కలు ఎండిపోకుండా ట్యాంకర్ల ద్వారా నీరు అందించాలన్నారు. కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించి, కూలీలతో చెట్లకు పాదులు చేసి నీరు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నర్సరీలో పెంచుతున్న మొక్కలు సక్రమంగా పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం గ్రామ పంచాయతీలో రికార్డులు పరిశీలించారు. ఇన్‌చార్జ్ ఏపీఓ ఈశ్వర్, కార్యదర్శి సైదమ్మ తదితరులు ఉన్నారు.

ఆటో కార్మికులను ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

నాగర్‌కర్నూల్ రూరల్: రాష్ట్రంలో ఆటో కార్మికులు జీవనోపాధిని కోల్పోయి రోడ్డున పడ్డారని, వారిని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మారేడు శివశంకర్ కోరారు. శనివారం ఈ మేరకు పట్టణంలో ఆటో కార్మికులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రధానంగా తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం మహాలక్ష్మి పేరుతో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించడంతో కార్మికులు రోడ్డున పడ్డారని, ప్రభుత్వం వారిని ఆదుకోవాల్సిన అవసరం ఉందని గుర్తుచేశారు. యూనియన్ నాయకులు ఎండీ రజాక్, రాజు, నాగేందర్‌గౌడ్, శివరామచంద్ర, కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మోతాదుకు మించి ఎరువులు వాడొద్దు

లింగాల: యాసంగిలో సాగు చేసిన వరి పంటలో తగు జాగ్రత్తలు తీసుకొని చీడపీడల బారిన పండకుండా కాపాడుకోవాలని మండల వ్యవసాయాధికారి నాగార్జునరెడ్డి రైతులకు సూచించారు. మండల పరిధిలోని అవుసలికుంట శివారులో యాసంగిలో సాగు చేసిన వరి పంటను శనివారం ఏఓ పరిశీలించి రైతులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రస్తుతం పంట నాటే దశ నుంచి పిలకల దశలో ఉందని, ఈ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా అధికారులు, శాస్త్రవేత్తలు సిఫార్సు చేసిన మోతాదులో ఎరువులను వాడాలని సూచించారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనకు భూమిపూజ

వెల్దండ: మండల పరిధిలోని అంతిరెడ్డిపల్లిలో శనివారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన సిద్ధాంతి రాజశేఖర్‌శర్మ ఆధ్వర్యంలో భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఫిబ్రవరి 13, 14, 15 తేదీలో బొడ్రాయి ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఉత్సవాలకు ఆలయాలను సిద్ధం చేస్తామన్నారు. గ్రామంలో ప్రజలందరూ ఉత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సర్పంచ్ కాలే లక్ష్మమ్మ, ఎంపీటీసీ లక్ష్మమ్మ, సులోచన, కరుణాకర్‌రెడ్డి, వెంకటయ్య, మల్లేష్ పాల్గొన్నారు.

ఇసుక తరలించొద్దని గ్రామస్తుల తీర్మానం

తాడూరు: మండలంలోని పాపగల్‌లో 'మన ఊరు– మన ఇసుక' కార్యక్రమంలో భాగంగా ఇసుకను తీసేందుకు డంపు పరిశీలించేందుకు మైనింగ్ అధికారులు గ్రామానికి శనివారం వెళ్లారు. గ్రామస్తులంతా ఎటువంటి పరిస్థితుల్లో ఇసుకను తరలించేందుకు వీల్లేదంటూ పట్టుబట్టారు. ఈ విషయమై నిర్ణయించిన గ్రామసభలో కూడా తీర్మానం చేశారు. తమ గ్రామం నుంచి ఎటువంటి ఇసుకను తీసుకుపోవడానికి వీల్లేదంటూ తీర్మానంలో పేర్కొన్నారు. ఇసుక వెళ్తే తమ బోరుబావులు ఎండిపోతాయని, దీంతో వ్యవసాయం ఇబ్బందికరంగా మారుతుందన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి కూడా ఇసుకను, దుందుబీ వాగును నమ్ముకుని జీవిస్తున్నామని, ఎలాంటి అనుమతులు ఒప్పుకోమని ఇందుకు సంబంధించి కలిసికట్టుగా గ్రామసభ ద్వార తీర్మానిస్తున్నట్లు గ్రామస్తులు మైనింగ్ అధికారులకు విన్నవించారు.